# సిపిఐ (మావోయిస్ట్) అగ్రనాయకుడు, కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్‌కు అరుణారుణ జోహార్లు

**భారతదేశంలోని** పీడితవర్గాల ప్రజలు–వ్యవస్థ మార్పు కొరకు, దోపిడీ అణిచివేతల పాలక వర్గాలను అధికారం నుండి తొలిగించటం కొరకు ఎంతో ఆశతో, 67 నక్షల్‌బరి నుండి పోరాటాలు సాగించుతున్నారు. ప్రజల ఆకాంక్షలకు, పోరాటాలకు, 67లో ముందుకు వచ్చిన నక్షల్‌బరి రైతాంగ తిరుగుబాటు ఒక నిలువుటద్దం – మలుపుటద్దం. నాటి నుండి, కార్మిక కర్షక వర్గాలను, ప్రజాతంత్రశక్తులను రాజ్యాధికారంలోనికి తీసుకొనిరావటానికి, నూతన ప్రజాతంత్ర వ్యవస్థను నెలకొల్పటానికి కమ్యూనిస్టు విప్లవశక్తులు, రెక్కలు విప్పుకొంటున్న నవతరాలు – నక్షల్‌బరి పోరాట ఉత్తేజంతో, తమతమ స్వంతాలను వదిలివేసి, ప్రజలతో కలిసి జీవించటానికి, ప్రజలతో కలిసిమెలిసి పోరాటాలు సాగించటానికి తమతమ జీవనాలను మల్చుకున్నారు, జీవితాలను అర్పించారు, అర్పించుతున్నారు. వారి వరుసలో కామ్రేడ్ ఆర్.కె. స్థానం పదిలంగా వుంటుంది.

పాలకవర్గాల వంచనతోకూడిన దోపిడీ విధానాలను వెల్లడిచేసి, ప్రజలతో నిలవేయించి, ప్రజల ప్రజాస్వామిక వాంఛలైన భూమి, భుక్తి, సమానత్వం మెరుగైన జీవితం కొరకు, నూతన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పటం కొరకు కమ్యూనిస్టు విప్లవకారుల సంస్థలు అనేక తేడాలు, విభేదాలతో ప్రజల మధ్య కార్యాచరణలో వున్నారు.

కా॥ అక్కిరాజు హరగోపాల్ – ఆర్.కె. విద్యార్థిగా ఆర్.ఎస్.యు.తో తన సామాజిక, విప్లవ కృషిని మొదలెట్టి, ఆపై సిపిఐ ఎంఎల్ (పిడబ్ల్యు)లోనూ, సిపిఐ(మావోయిస్టు)లోనూ ఉన్నత బాధ్యతల నిర్వహణకు ఎదిగాడు, నిర్వహించాడు.

సామ్రాజ్యవాదుల, దళారీల పాలకవర్గాలు సమాజంపై విసిరిన పేండమిక్ కోవిడ్ బారినపడి కోలుకుంటూ, దీర్ఘకాలిక జబ్బులతో తరువాతి పరిణామాల వలన అక్టోబర్ 14వ తేది ఉదయం మరణించినట్లు మావోయిస్టు పార్టీ నాయకత్వం ప్రకటించింది. ప్రజలను, విప్లవ శ్రేణులను వదిలివెళ్తూ, లక్ష్యసాధనకు – సిద్ధాంతానికి అంకితమైన ఆదర్శ జీవితసారాన్ని సహచరులకు, విప్లవకారులకు మిగిల్చిన కా॥ అక్కిరాజు హరగోపాల్‌కు అరుణారుణ జోహార్లు.

**విశ్వం,**
ప్రధాన కార్యదర్శి,
**సిపిఐ(ఎం–ఎల్)**